క్లుప్తంగా

బాల్యవివాహాలు అరికట్టాలి



జడ్చర్ల టౌన్: బాల్యవివాహాలు చేసుకోరాదని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఉదయ మెమోరియల్ హైస్కూల్‌లో నిర్వహించిన న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బాల్యవివాహాలు చేసుకోమని, అరికడతామని విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపల్ వీణశివకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య, న్యాయవాదులు మాలిక్‌షాకీర్, విశ్వేశ్వర్, రాములు, సాహితిలు పాల్గొన్నారు.

మండల పరిషత్‌ను సందర్శించిన ట్రైనీ బృందం



నవాబుపేట: మూడురోజుల పర్యటనకు వచ్చిన ట్రైనీ అధికారుల బృందం బుధవారం నవాబుపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న పనుల గూర్చి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్, గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కార్యాలయాలు సందర్శించి అక్కడికి వచ్చే లబ్ధిదారులు, ప్రజల గూర్చి తెలుసుకున్నారు. వారికి తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు కార్యాలయాల్లోని పనుల గూర్చి వివరించారు.

తుల్జాభవాని ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే

జడ్చర్ల: మండలంలోని చిన్నగుట్టతండాలో తుల్జ భవానీ ఉత్సవాల్లో బుధవారం మాజీ ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా వాసులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మాజీ ఎంపీటీసీ రవినాయక్, నాయకులు ప్రణీల్, శ్రీకాంత్, వీరేష్, ఇమ్ము, పాండు, గౌస్, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరుశవేదీశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుశవేదీశ్వర ఆలయాన్ని బుధవారం హైదరాబాద్ విజయనగర్ కాలనీకి చెందిన 50మంది భక్తులు సందర్శించారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు, అభిషేకం చేసి వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం సందర్భంగా పరుశవేదీశ్వర ఆలయాన్ని దర్శించేందుకు భక్తులను తీసుకొచ్చినట్లు మాజీ ఎంపీటీసీ మణెమ్మ తెలిపారు. తమ కాలనీలోనే ఉంటున్న టీటీడీ బోర్డు సభ్యురాలు మణెమ్మ తమతో వచ్చిందన్నారు. ఆలయానికి వచ్చిన టీటీడీ బోర్డు సభ్యురాలిని శాలువా, పూల మాలతో సత్కరించారు.

మిడ్జిల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పరిశీలన



మిడ్జిల్: మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సీఎంను కోరగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు బుధవారం అధికారులు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించారు. మిడ్జిల్‌తో పాటుగా తలకొండపల్లి, ఊర్కొండ మండలాల విద్యార్థుల సంఖ్య, అప్రాంతాల వారు డిగ్రీ చదువుకోవడానికి దూరం వెళ్లాల్సి వస్తుందని గుర్తించారు. ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు మండల విద్యాధికారులతో కలిసి వసతులపై ఆరా తీశారు. పరిశీలించిన వారిలో కల్వకుర్తి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శర్వాణి, వైస్ ప్రిన్సిపల్ వాణి, మిడ్జిల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తిర్పతయ్య, నాయకులు ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హనుమంతు, గీత దంపతుల కుమారుడు శశాంక్‌సూర్య పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్, సురేష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో శిక్షణాధికారులు

- దేవరకద్రలో సివిల్ సర్వీస్ అధికారులు పర్యటన
- ప్రభుత్వ కార్యాలయాల సందర్శన
- రెవెన్యూ, మహిళా సంఘాల పని తీరుపై చర్చ
- ఆస్పత్రి వైద్య సేవల పరిశీలన



దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో భూమి పాస్‌పుస్తకాలు, ఓటరు నమోదుపై చర్చిస్తున్న సివిల్ సర్వీసు శిక్షణాధికారులు

దేవరకద్ర: సివిల్ సర్వీసు శిక్షణ అధికారుల బృందం బుధవారం మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి వాటి పని తీరు, పథకాల అమలు చేసే విధానంపై, ఇంకా పలు అంశాలపై అధికారులతో చర్చించారు. దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుతో సివిల్ సర్వీసు శిక్షణ అధికారులు అజయ్ కుమార్, వివేక్ ప్రవీణ్‌కుమార్, దీక్షికా మీనా, యోగేంద్ర మీనా, ఆస్తాలు సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. నిధుల వినియోగం గ్రామ పంచాయతీలలో ఉండే అధికారుల పనితీరు ఇంకా వివిధ పథకాలను అమలు చేసే విధానాలపై కింది స్థాయి అధికారుల పర్యవేక్షణ వంటి అంశాల గురించి తెలుసుకున్నారు. మండల పరిధిలో ఉండే ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులను గురించి తెలుసుకున్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులతో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే తీరును తెలుసుకున్నారు. దేవరకద్ర మండల మహిళా సమాఖ్యలో మహిళా సంఘాల ప్రతినిధులతో సివిల్ సర్వీస్ శిక్షణాధికారులు సమావేశమయ్యారు. గ్రామ స్థాయిలో ఉండే మహిళా సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య పనితీరు, వాటి అనుసంధానం, బ్యాంకు రుణాలు, చెల్లింపులపై ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ చట్టాల అమలు తీరు, భూమి హక్కు పాసు పుస్తకాలు, పహాణీ, ఆర్‌ఓఆర్, రైతులతో ఉండే అనుబంధాలపై చర్చించారు. డీటీలు ఖలీల్ అహమ్మద్, దీపిక వారికి రెవెన్యూ శాఖలో చేపట్టే పనులను వివరించారు. ఓటరు నమోదు విభాగం, రిజిస్ట్రేషన్ విభాగాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎమ్మార్సీని సందర్శించి వైద్యసేవలు, విద్యా వ్యవస్థపై మండల అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలను తెలుసుకున్నారు.

ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



విద్యార్థిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు: కలుషిత ఆహారం తినడం వల్ల అస్వస్థతకు గురై జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాగనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతుంటే ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దిద్దుబాటు చర్యలు పెట్టకపోతే, ఇదే తరహా ఘటనలు పునరావృతం అయితే ప్రజల్లో తిరుగుబాటు వస్తోందన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరడానికి విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సైతం భయపడుతారన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ బంగ్లా పక్కనే ఉన్న వసతి గృహంలో పురుగుల బియ్యం, సరైన ఆహారం పెట్టడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు గంజి వెంకన్న, శివరాజ్, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, చెన్నయ్య పాల్గొన్నారు.

బీసీలు సంఘటితమైతేనే సంక్షేమం సాధ్యం



నూతన కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కార్యాలయంలో బీసీ మహాసభ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బీసీలో ఉన్న 126 కులాలు కలిసి కట్టుగా ముందుకు వస్తే బీసీలు తమ హక్కులను సాధించుకోవచ్చన్నారు. బీసీల అభివృద్ధి కోసం కృషి చేసే నాయకులను ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో బీసీ మహాసభ మహబూబ్‌నగర్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కుమ్మరి రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర జనార్దన్ బోయ, తదితర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, రంగారెడ్డి జిల్లా యువత విభాగం అధ్యక్షులు శ్రీధర్ వర్మ, సిద్దిరామప్ప, సతీష్ బోయ, బ్రహ్మయ్య, అంబదాస్ కల్యాణి, జోరిగ ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మూసాపేటలో విద్యార్థులకు ప్రేరణ తరగతులను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అడ్డాకుల: విద్యార్థులు పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించి ఉన్నత శిఖరాలకు చేరుతారని మానసిక వికాస నిపుణుడు శ్రీనివాస్ అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ తరగతిలో ఆయన మాట్లాడారు. పసి ప్రాయంలోని వారికి ప్రేరణ, మానసిక వికాసం, తగిన పరిణితి అవసరమని చెప్పారు. ఈ వయసులోనే లర్నింగ్‌ను బట్టి విధానంలో కాకుండా అవగాహన, ఊహాతీత, శాస్త్రీయ విధానంలో అభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరవచ్చని తెలిపారు. విద్యార్థులకు తమ జీవితంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేశ్వర్‌రెడ్డి, శివశరనప్ప, గోవర్ధన్‌రెడ్డి, నాగార్జున, నరసప్ప, శివరాజు, సతీష్, సత్యయ్య, శోభారాణి, అరుణ, రాధా, గీతజ్ఞాన, సుగుణ తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ కనెక్షన్ పునరుద్ధరిస్తాం



కళాశాల అధ్యాపకులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు త్వరలోనే మిషన్ భగీరథ పథకం కనెక్షన్‌ను పునరుద్ధరిస్తామని మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ కళాశాలకు గతంలో ఉన్న కనెక్షన్‌ను జిల్లా ప్రధాన స్టేడియం ఆర్చ్ నిర్మాణ సమయంలో తొలగించాల్సి వచ్చింది. దీంతో అప్పటి నుంచి తాగునీటి సరఫరా కాకపోవడంతో విద్యార్థినులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని తాజాగా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

'భాషా పండిత్‌లకు పదోన్నతి కల్పించాలి'



డీఈఓ ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న ఆర్‌యూపీపీటీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో మిగిలిన భాషా పండిత్‌లకు వెంటనే పదోన్నతి కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంఘం (ఆర్‌యూపీపీటీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కోశాధికారి ఘట్టా గిరిజారమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. బై, అగైనెస్ట్ పోస్టుల్లో కొనసాగుతున్న వారిని అవసరమైన పాఠశాలలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, చక్రవర్తుల రమణాచార్యులు, తిమోతి, రాధిక, రాధమ్మ, స్వప్న పాల్గొన్నారు.

కాలుష్య కారక కంపెనీలు రద్దు చేయాలి

పాలమూరు: కాలుష్య కారక ఇథనాల్, ఫార్మా కంపెనీలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నూతన ఆర్థిక విధానాలతో బహుళ జాతి కంపెనీలు, దేశ విదేశ కార్పొరేట్ ప్రయోజనాలకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల వల్ల రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేసిందని, వద్దని ప్రజలు పోరాటం చేసి చేశారన్నారు. ఇప్పటికైన సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఇలాంటి కంపెనీలను రద్దు చేయాలని కోరారు.

రైతు సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

రాజాపూర్: అమిస్తాపూర్‌లో నిర్వహిస్తున్న రైతు సదస్సులో వ్యవసాయ, అనుబంధ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఎలక్ట్రికల్ ట్రాక్టర్స్, డ్రోన్‌లతో పాటు వివిధ రకాల వంగడాలపై ప్రదర్శనను రాజాపూర్ మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం రాజాపూర్ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ విధానాలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడిపరిశ్రమ, మత్స్య తదితర ఆదర్శ రైతుల ప్రసంగాలతో పాటు విజయగాథలపై వీడియో ప్రదర్శన ఉంటుందని తెలిపారు. గురువారం రాజాపూర్ మండల కేంద్రం నుంచి ఉదయం 8:30 గంటలకు అమిస్తాపూర్ వెళ్లేందుకు బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. ఏఈఓలు శ్రీనివాస్, దీపిక పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

రాజాపూర్: ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. బుధవారం రాజాపూర్ శివారులోని కేజీబీవీ పాఠశాల పక్కన రెండు ఇసుక ట్రాక్టర్లు ఇసుకతో వస్తుండగా, పోలీస్ సిబ్బంది ఆపి అనుమతి పత్రాలపై డ్రైవర్ పాత్లావత్ రాజేందర్‌ను ఆరా తీశారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దుందుభీ వాగు నుంచి ఇసుక ఫిల్టర్‌చేసేందుకు ఉపయోగించే ట్రాక్టర్ ఇంజన్, మరో ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేజీబీవీ ఉపాధ్యాయుల నిరసన



మిడ్జిల్: మండల కేంద్రంలోని కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వం స్పందించి త్వరగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. వారికి మండల టీఎస్‌యూటీఎఫ్ వారు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారిణి కవిత, నర్సింహులు, వెంకటయ్య, గీత, హాజిత, కృష్ణవేణి, మణి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర

మహమ్మదాబాద్/గండీడ్: ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు విజయోత్సవ కళాయాత్ర కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ దేవన్న తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మంగళవారం గండీడ్ మండలంలోని వెన్నాచేడ్, పగిడ్యాల్, మహమ్మదాబాద్ గ్రామాల్లో ప్రజాపాలన విజయోత్సవ కళాయాత్ర ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ మరిన్ని హామీలను త్వరలో నెరవేర్చబోతున్నదని కళాకారులు సూచించారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీబస్సుల్లో ఉచిత ప్రయాణం, 200యూనిట్లు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర ప్రభుత్వ పథకాలపై ఆటపాటలతో ప్రజలను చైతన్యపర్చే కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం

- ఫంక్షన్ హాలు నుంచి కాలనీ డ్రెయిన్ వరకు యూజీడీ ఏర్పాటుకు యాజమాన్యం అంగీకారం
- న్యూ బాలాజీనగర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



న్యూ బాలాజీనగర్ లో యూజీడీ పైపులైన్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక న్యూ బాలాజీనగర్ (వార్డు నం.11) లోని ఓ ఫంక్షన్‌హాలు నుంచి మురుగు బయటకు వదలడంతో దుర్గంధంగా మారిందని కాలనీవాసులు గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మురుగును సమీపంలోని డ్రెయిన్‌లో కలిపేందుకు వారు అప్పట్లో అంగీకరించకపోవడంతో సదరు ఫంక్షన్‌హాలు యాజమాన్యం కోర్టుకు వెళ్లింది. తాజాగా అక్కడి నుంచి వచ్చిన ఆదేశాల మేరకు డ్రెయిన్‌లో కలిపేందుకు కాలనీ వాసులు అంగీకరించడంతో సమస్య పరిష్కారమైంది. బుధవారం అక్కడికి మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి వెళ్లి ఇరువర్గాల వారితో మాట్లాడారు. ఈ మేరకు వెంటనే ఫంక్షన్‌హాల్ యాజమాన్యం సుమారు 60 ఫీట్ల వరకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) కోసం పైపులైన్ వేయనున్నారు.

మయూరి పార్క్‌లో కార్తీక వనమహోత్సవం



మయూరి పార్కు లో వినాయకనగర్ కాలనీ వాసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎదిర బైపాస్ చౌరస్తా రోడ్‌లోని వినాయకనగర్ కాలనీ వాసులంతా కలిసి బుధవారం మయూరి పార్కులో కార్తీక మాస వన భోజన మహోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా కుటుంబ సభ్యులు సుమారు 150 మంది ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ద్యావ అనంతరెడ్డి, అధ్యక్షుడు జీటీ నరేందర్, ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, కార్య నిర్వాహక అధ్యక్షుడు ఎన్.వెంకటేష్, కోశాధికారి శ్రీనివాస్ ఆర్య, ఉపాధ్యక్షులు డా.నరేష్‌చంద్ర, మహిపాల్‌రెడ్డి, ప్రచార కార్యదర్శులు అంజిత్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్తీక వనభోజనం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం కార్తీకమాసం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. అహ్లాదకరమైన వాతావరణంలో ఉద్యోగస్తులు, వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుజాత, అధికారులు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు



మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

మహమ్మదాబాద్: కొందరు ఇసుక వ్యాపారులు ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై బుధవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఎవరికైనా ఇంటి నిర్మాణం కోసం ఇసుక అవసరమైతే తహసీల్దార్ మైనింగ్ శాఖల నుంచి అనుమతి తప్పకుండా తీసుకోవాలని, లేదంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల కొందరు ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుకుని ఇసుకను తరలించేందుకు అనుమతి ఇవ్వలేదని, అలాంటి వ్యక్తులు తమపై నిందలు మోపి పోలీసులపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. అలాంటి దళారులకు, ఇసుక వ్యాపారులకు అనుమతి ఇచ్చేది లేదన్నారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా ఇసుక అవసరమున్న వ్యక్తులు సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి అనుమతి తీసుకుని ఇసుకను తీసుకెళ్లాలని సూచించారు.

జాతీయ ఉషూ పోటీలకు సయ్యద్ అఖిల్



క్రీడాకారుడిని సన్మానిస్తున్న ఎన్‌పీ.వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో వచ్చేనెల 1 నుంచి 6 వరకు జరిగే సబ్ జూనియర్ జాతీయస్థాయి ఉషూ పోటీలకు జిల్లాకు చెందిన సయ్యద్ అఖిల్ ఎంపికైనట్లు ఉషూ అసోసియేషన్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు మహ్మద్ షకీల్ అహ్మద్ తెలిపారు. 48కేజీల విభాగంలో అఖిల్ పోటీపడుతున్నట్లు తెలిపారు. కోచ్‌గా అశ్వాక్ వ్యవహరిస్తారని తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో క్రీడాకారుడిని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పీ.వెంకటేశ్ అభినందించి సన్మానం చేశారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలని కోరారు. కార్యక్రమంలో ఉషూ అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఇలియాజ్ పాల్గొన్నారు.

అనుమతిలేని పాఠశాలపై చర్యలు తీసుకోండి



మహమ్మదాబాద్ గ్లోబల్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

మహమ్మదాబాద్: మండలంలో అనుమతి లేని గ్లోబల్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రానికి చెందిన గ్లోబల్ పాఠశాల వ్యాను మంగంపేట్‌తండా దగ్గర బోల్తాపడి విద్యార్థులకు గాయాలైనా పట్టించుకునే అధికారులు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాలను సందర్శించి విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. గ్లోబల్ పాఠశాల పంచశీల పేరుతో చలామణి అవుతూ ఎలాంటి అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా పాఠశాల యాజమాన్యం, ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పాఠశాల అనుమతి పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటదుర్గా ప్రసాద్, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

గేట్ వాల్వ్ వద్ద లీకేజీ

- పద్మావతి కాలనీలో రోడ్డుపై పారుతున్న తాగునీరు



పద్మావతికాలనీలో లీకేజీ అవుతున్న గేట్‌వాల్వ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని పద్మావతికాలనీ (వార్డు నం.7) లోని మహేంద్ర కాలనీకి వెళ్లే దారిలో గేట్‌వాల్వ్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కొన్ని రోజులుగా రోడ్డుపై వృథాగా ఏరులై పారుతోంది. ఈ విషయమై ఏఈ హరికృష్ణను వివరణ కోరగా, వెంటనే దానిని బాగు చేయించి అక్కడ లీకేజీ కాకుండా చూస్తామని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జడ్చర్ల: పురపాలిక పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిని సారించాలని పురపాలిక చైర్‌పర్సన్‌పుష్పలత సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పుర కార్యాలయంలో పారిశుద్ధ్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. పట్టణ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన మరింతగా పెంపొందించాలని కోరారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అన్ని వార్డులలో పర్యటించి పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, నందకిషోర్, ఉమాశంకర్, మహేశ్, జ్యోతి, లత, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.